క్లుప్తంగా

'డబుల్' లబ్ధిదారులకు బిల్లుల అందజేత


నగదు అందజేస్తున్న సర్పంచ్, నాయకులు

సాక్షి ఎఫెక్ట్

ముస్తాబాద్: ముస్తాబాద్ మండలం తెర్లుమద్దిలో డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులకు బిల్లులను బుధవారం పంపిణీ చేశారు. ఇళ్లు కట్టుకున్న 17 మందికి రూ.33.03 లక్షలను అందజేసినట్లు సర్పంచ్ కలకొండ కిషన్‌రావు తెలిపారు. సాక్షిలో ఈనెల 9న ×అప్పుల్లోకి నెట్టేసిన సొంతింటి కల❋ శీర్షికన డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మించుకునే వారి బాధలను వివరిస్తూ ప్రచురితమైన వార్తకు స్పందించిన ఎంపీపీ శరత్‌రావు, సర్పంచ్ కిషన్‌రావు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇళ్లు నిర్మించుకుని ఏడాది గడిచిన ఒక్క బిల్లు రాని వైనాన్ని సాక్షి ఆవిష్కరించిందని, బిల్లులు అందజేసిన కలెక్టర్‌కు లబ్ధిదారులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ నాగుల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం


ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

సిరిసిల్లటౌన్: కార్మికక్షేత్రం సిరిసిల్లలో బుధవారం భక్తి పారవశ్యం వెల్లివిరిసింది. స్థానిక విద్యానగర్ అభయాంజనేయ స్వామి ఆలయంలో పద్దెనిమిదో వార్షికోత్సవాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అర్చకస్వామి మాడంరాజు కృష్ణమాచారి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు జరిపించారు. వందలాది సంఖ్యలో భక్తులు ఇష్టదైవాన్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ రమేశ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, పట్టణ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

రజకుల సంబరాలు


చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద సంబరాలు

ముస్తాబాద్: పోతుగల్ ఏఎంసీ చైర్మన్‌గా రజక సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు అక్కరాజు శ్రీనివాస్‌ను ప్రభుత్వం నియమించిన సందర్భంగా ముస్తాబాద్ చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద బుధవారం సంబరాలు చేసుకున్నారు. ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి, సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రజక సంఘం మండల అధ్యక్షుడు నారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు మిడిదొడ్డి యాదగిరి, నాయకులు శెరయ్య, సింగపూర్ సత్తయ్య, మిడిదొడ్డి హన్మయ్య, సుద్దాల దేవయ్య, శ్రీనివాస్, భాను, గ్రామ అధ్యక్షులు పాల్గొన్నారు.

మర్కటం.. సంకటం

- గ్రామాల్లో కోతుల బెడద
- గుంపులుగా దాడులు
- ఇళ్లు, పంటలు నాశనం
- పలువురికి గాయాలు
- బెంబేలెత్తుతున్న గ్రామస్తులు
- పట్టించుకోని అధికారులు


ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు గుగ్గిళ్ల లక్ష్మి. నాలుగు రోజుల క్రితం వానర సైన్యం ఇంటి మీదికి దూసుకు వచ్చాయి. అడ్డుకోబోయిన లక్ష్మిపైకి దాడికి పాల్పడగా భయానికి పరుగులు తీసింది. దీంతో బాధితురాలి మీదకి కోతులు దూకడంతో ఆమె అదుపుతప్పి కింద పడింది. దీంతో ఆమె ఎడమ చేయి విరిగింది. ప్రస్తుతం చికిత్స పొందుతోంది.


ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు అతికం లత. గ్రామం పెద్దూరు. ఇంట్లో ఆవరణలో కూర్చున్న ఆమెపై కోతులు దాడికి పాల్పడ్డాయి. కోతుల దాడిలో ముఖం, చేతిపై గాయాలై రక్తస్రావం జరుగగా ఆసుపత్రికి తీసుకవెళ్లి చికిత్స అందించారు. అంతేగాక తిప్పవరం లచ్చవ అనే వృద్ధురాలుపై దాడికి పాల్పడడంతో నుదుముకి తీవ్ర గాయాలయ్యాయి.


పెద్దూరులోని ఓ ఇంటిపై పెంకులను చిందరవందర చేస్తున్న వానర సైన్యం

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరు గ్రామంతో పాటు తదితర గ్రామాల్లో వానర సైన్యాలు స్వైర విహారం చేస్తున్నాయి. కోతుల బెడదతో ప్రజలు, రైతన్నలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఇంట్లో నుంచి బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. గంపులు గుంపులుగా సంచరిస్తూ విచక్షణరహితంగా దాడులకు పాల్పడుతున్నాయి. కోతుల దాడుల్లో ఇళ్లు పాక్షికంగా ధ్వంసం అవుతున్నాయి. ప్రజలు గాయాల బారిన పడుతున్నారు. కోతుల బెడద నుంచి తమను రక్షించాలని ఫారెస్ట్, మున్సిపల్ అధికారులను గ్రామస్తులు వేడుకుంటున్నారు.

ఓవైపు కుక్కలు, మరోవైపు కోతులు

సిరిసిల్ల మున్సిపల్ పరిధి విలీన గ్రామాల్లో ఓవైపు కుక్కలు, మరోవైపు కోతులు బెడద రోజురోజుకు పెరిగిపోతోంది. కుక్కలు, కోతులు గుంపులుగా సంచరిస్తూ ప్రజలు, వాహనదారులపై దాడులకు పాల్పడుతున్నాయి. ఇటీవల బల్దియా కుక్కలను బంధించి వాటిని నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటుంది. కానీ ప్రస్తుతం గ్రామాల్లో కోతుల బెడద విపరీతంగా పెరిగింది. జనసంచారం ఉన్న చోట స్వైర విహారం చేస్తూ ప్రజలను బెంబెలెత్తిస్తున్నాయి. బయటకు అడుగు వెద్దామంటే ఎటువైపు నుంచి దాడి చేస్తాయా అని భయపడుతున్నారు. బిక్కు బిక్కుమంటూ ఇళ్లలోనే గడుపుతున్నారు. చేతిలో కర్ర పట్టుకొని బయటకు వెళ్లలేని పరిస్థితి ఉందంటూ గ్రామస్తులు తెలుపుతున్నారు.

తలుపు తీస్తే ఇల్లు లూటీ..

గ్రామాల్లోని ఎక్కడ తలుపు తీసి ఉంటే ఆ ఇంటిని లూటీ చేస్తున్నాయి. పెంకుటిళ్లపై గంపులుగా సంచరిస్తూ వాటిని పెకిలిస్తూ, ధ్వంసం చేస్తున్నాయి. ఇంట్లోకి చొరబడి నిత్యావసర సరుకులను, సామాగ్రిని, దుస్తులను చిందర వందర చేస్తున్నాయి. వండుకున్న అన్నం సైతం కోతులే ఎత్తుకెళ్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. అడ్డుకున్న వారిపై విచక్షణరహితంగా దాడులకు పాలడుతున్నాయి. కోతుల దాడుల్లో ఇప్పటికే పలువురు తీవ్రగాయాలపాలై చికిత్స పొందుతున్నారు. దీంతో తలుపులు వేసుకొని ఇంట్లోనే నిత్యం భయంతో బతుకుతున్నారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, వృద్ధులు బయటకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. ఫారెస్టు, మున్సిపల్ అధికారులు కోతుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పంటలు ధ్వంసం

వానర దండు గ్రామాల్లోని ఇళ్లు, ప్రజలపై దాడులకు పాల్పడుతూ మరోవైపు పంటలను నాశనం చేస్తున్నాయి. గుంపులుగా పంట పొలాల్లో తిరుగుతూ, పంటను తొక్కుతూ నాశనం చేస్తున్నాయి. కూరగాయాలు, మామిడి తదితర తోటలను సైతం వానర సైన్యం ధ్వంసం చేస్తున్నాయి. దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నామని తెలిపారు. అటు ఇంటి దగ్గర, ఇటు పంట పొలాల దగ్గర కాపు కాస్తు రక్షించుకుంటున్నామని తెలిపారు. వాటికి ఎదురు తిరిగితే దాడులకు పాల్పడుతున్నట్లు రైతులు తెలిపారు. కోతుల బెడదను నియంత్రించాలిన అధికారులు పట్టించుకోకపోవడం నష్టపోతున్నట్లు తెలిపారు.

ఇబ్బంది పడుతున్నం


గ్రామంలో కోతులు వల్ల చాలా ఇబ్బంది పడుతున్నాం. కోతుల గుంపు ఇండ్లలోకి చొరబడి వంట సామాగ్రిని, ఆహార పదార్థాలను ధ్వంసం చేస్తున్నాయి. అడ్డుకోబోయిన వారిపై దాడులకు పాల్పడుతున్నాయి. పాఠశాలలకు వెళ్లే చిన్నారులు, పాదచారులు కోతుల బెడదతో బెంబేలెత్తుతున్నారు. అధికారులు కోతుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.
– గుగ్గిళ్ల దేవయ్య, పెద్దూరు గ్రామం

మీదపడి కరుస్తున్నాయి


విలీన గ్రామాల్లో కోతుల బెడద రోజురోజుకు పెరిగిపోతోంది. ఇండ్లపై దాడిచేసి బీభత్సం సృష్టిస్తున్నాయి. పెంకులను తొలగిస్తూ ఇళ్లను ధ్వంసం చేస్తున్నాయి. పంటపొలాల్లో సంచరిస్తూ వాటిని తొక్కివేయడంతో రైతులు నష్టపోతున్నారు. కోతులను అడ్డుకున్న వారిపై మీద పడి కరుస్తున్నాయి. ఇప్పటికైనా ఫారెస్టు అధికారులు కోతులను పట్టుకునేందుకు చర్యలు తీసుకోవాలి.
– ఎర్రవెల్లి వెంకటరమణారావు, సిరిసిల్ల ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్

రక్షాబంధన్


గంభీరావుపేట: రాఖీ ఆకృతిలో విద్యార్థులు


సిరిసిల్లటౌన్: ప్రైవేటు పాఠశాలల్లో రక్షాబంధన్ వేడుకలు


ముస్తాబాద్: పోలీసులకు..




ఎల్లారెడ్డిపేటలో..

జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రయివేట్ విద్యా సంస్థల్లో ముందస్తు రక్షాబంధన్ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. అన్నా చెల్లెళ్ల అనురాగానికి ప్రతీకగా రక్షాబంధన్ నిలుస్తుందన్నారు. భారతీయ సంస్కృతి,సంప్రదాయాలను అనుసరించాలని కోరారు. విద్యార్థినులు, సహచర విద్యార్థులతో పాటు, పోలీసులకు రాఖీలు కట్టారు. – సాక్షి నెట్‌వర్క్

'రసమయి'ని సన్మానించిన కళాకారులు


రసమయికి శాలువా కప్పుతున్న కళాకారులు

సిరిసిల్ల: తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి, మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ను బుధవారం సాంస్కృతిక సారధి కళాకారులు సన్మానించారు. తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారుల వేతనాలను 30 శాతం పెంచినందుకు జిల్లాకు చెందిన కళాకారులు ఎడమల శ్రీధర్‌రెడ్డి, ఆకునూరి దేవయ్య, శ్రీరాముల రామచంద్రం పూల బొకే అందించి, శాలువాతో సన్మానించారు. కళాకారుల ఆర్థిక పరిస్థితిని గుర్తించి చేయూత నిచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణకు తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు కృతజ్ఞతలు తెలిపారు.

మెడికల్ కాలేజీకి వాటర్ డిస్పెన్సర్ వితరణ


వాటర్ డిస్పెన్సర్ అందించిన అధికారులు

సిరిసిల్ల: సిరిసిల్ల మెడికల్ కాలేజీకి పంజాబ్ నేషనల్ బ్యాంకు అధికారులు వాటర్ డిస్పెన్సర్‌ను బుధవారం అందించారు. సామాజిక సేవ(సీఎస్‌ఆర్)లో భాగంగా మెడికల్ కాలేజీ విద్యార్థులకు శుద్ధి చేసిన నీటిని అందించేందుకు వాటర్ డిస్పెన్సర్‌ను కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్‌కు బ్యాంకు అధికారులు రాఘవేంద్ర, కృష్ణమోహన్, నవీన్, వెంకటరమణ అందించారు. మెడికల్ కాలేజీ వైస్‌ప్రిన్సిపాల్ ఇక్బాల్ హైమద్, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

డీసీసీ ఉపాధ్యక్షుడిగా రాజు


నియామక పత్రాన్ని అందిస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అనుపురం గ్రామానికి చెందిన ఎర్రం రాజును డీసీసీ ఉపాధ్యక్షుడిగా నియామకం చేస్తూ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ ఉత్తర్వుల పత్రాన్ని బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బైకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎర్రం రాజు మాట్లాడుతూ ఓడిన కూడా ప్రజల సేవలో ఉన్న ఆది శ్రీనివాస్‌ను రానున్న ఎమ్మెల్యే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ భూపతి

గంభీరావుపేట: ఓటరు నమోదు కార్యక్రమాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ భూపతి అన్నారు. మండల కేంద్రంలోని కేజీ టు పీజీ విద్యా సంస్థల్లో భాగమైన ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో బుధవారం విద్యార్థుల కోసం ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు హక్కు విశిష్టత గురించి విద్యార్థులకు వివరించారు. ఓటరు నమోదు చేసుకునే విధానం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి.విజయలక్ష్మి, వైస్‌ప్రిన్సిపాల్ పిట్ల దాసు, ఆర్‌ఐ శ్రావణ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన పాడి రైతులు


రాస్తారోకో చేస్తున్న పాడి రైతులు

గంభీరావుపేట: పాడి రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రకటించిన లీటర్ పాలకు రూ.4 చొప్పున వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో పాడి రైతులు బుధవారం రోడ్డెక్కారు. ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహకం 2018 నుంచి ఇప్పటి వరకు ఇవ్వడం లేదని రైతులు తెలిపారు. వెంటనే ప్రోత్సాకాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతుల ఆందోళనకు బీజేపీ నాయకులు మద్దతు ప్రకటించి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల కేంద్రం రైతులు, డైరెక్టర్లు, చైర్మన్ రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతుకు డ్రోన్ స్ప్రేయర్


డ్రోన్ స్ప్రేయర్ అందిస్తున్న చైర్మన్ తిరుపతిరెడ్డి

వేములవాడఅర్బన్: వేములవాడ పీఏసీఎస్ ఆధ్వర్యంలో రైతు మిట్టపల్లి భూపెందర్‌రెడ్డికి రుణం ద్వారా రూ.8.90 లక్షల విలువైన డ్రోన్ స్ప్రేయర్‌ను వేములవాడ పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు డ్రోన్ స్ప్రేయర్ ద్వారా నిమిషాల వ్యవధిలోనే పంటలకు పురుగుల మందులను పిచికారీ చేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

పౌరహక్కుల దినోత్సవం


ఎల్లారెడ్డిపేట: బండలింగంపల్లిలో..

ఎల్లారెడ్డిపేట/ఇల్లంతకుంట/కోనరావుపేట/వేములవాడరూరల్/వీర్నపల్లి: జిల్లాలోని పలు గ్రామాల్లో బుధవారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలందరూ కలిసి మెలిసి ఉండాలని, హోటళ్లలో రెండు గ్లాసుల విధానాన్ని పాటించవద్దన్నారు. గ్రామాల్లో ఏమైనా సమస్యలుంటే శాంతియుతంగా పరిష్కరించుకోవాలని సూచించారు. సమస్య జఠిలంగా ఉంటే రెవెన్యూ, పోలీసులను ఆశ్రయించాలన్నారు.

కేసీఆర్ నాయకత్వంలోనే అభివృద్ధి

- వేములవాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు


లక్ష్మీనర్సింహారావుకు రాఖీ కడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ

వేములవాడ: ముంపు గ్రామాల ప్రజల సమస్యలను పరిష్కరిస్తానని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. వేములవాడ అర్బన్ మండలం చింతల్‌ఠాణా గ్రామానికి చెందిన గుర్రం మల్లారెడ్డి, పార్వతి మహేష్ గౌడ్, బొప్ప వెంకన్న, బొప్ప శ్రీనివాస్, వంగ సాయిప్రసాద్‌గౌడ్, కొలపూరి నర్సయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు బుధవారం వంద మంది పార్టీలో చేరగా, వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. మిడ్ మానేర్ ముంపు గ్రామమైన చీర్లవంచ వద్ద రూ.600 కోట్లతో అతిపెద్ద ఫిష్ హబ్ ఏర్పాటుకు రంగం సిద్ధమైందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, సిరిగిరి చందు, జోగిని శంకర్, నాయకులు గూడూరి మధు పాల్గొన్నారు.

మరింత అభివృద్ధి చేస్తా

కోనరావుపేట: మండలాన్ని ఎమ్మెల్యే రమేశ్‌బాబు అభివృద్ధి చేశారని, రానున్న కాలంలో మరిన్ని అభివృద్ధి పనులు జరిగేలా చూస్తానని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు అన్నారు. ఆయన స్వగ్రామమైన మండలంలోని మల్కపేటకు రాగా స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనకు జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, సర్పంచ్ ఆరె లత రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ మల్కపేటలో చేసిన అభివృద్ధిని గుర్తు చేస్తూ తనకు అవకాశం ఇస్తే ఇదే తరహాలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు అభివృద్ధి చెందేలా చూస్తానన్నారు. ఎంపీపీ చంద్రయ్య, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

తరలిన బీజేపీ నాయకులు


ర్యాలీగా తరలుతున్న వికాస్‌రావు, దీప

వేములవాడ: కేంద్ర మాజీ మంత్రి, మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు తనయుడు వికాస్‌రావు, ఆయన సతీమణి డాక్టర్ దీప బుధవారం హైదరాబాద్‌లో బీజేపీలో చేరేందుకు వేములవాడ నుంచి భారీ ర్యాలీగా తరలివెళ్లారు. స్థానిక భీమేశ్వర గార్డెన్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ ఆధ్వర్యంలో వికాస్‌రావు దంపతులను ఘనంగా సన్మానించారు. పాపన్న చౌక్ నుంచి ర్యాలీగా హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వికాస్‌రావు మాట్లాడుతూ ఐదేళ్లుగా వేములవాడ నియోజకవర్గంలో అనేక గ్రామాల్లో శుద్ధజల కేంద్రాలు, వైద్య శిబిరాలు నిర్వహించామన్నారు.

కోనరావుపేట: మండలంలోని అన్ని గ్రామాల నుంచి బీజేపీ నాయకులు అధికసంఖ్యలో తరలివెళ్లారు. జిల్లా కార్యదర్శి గోపాడి సురేందర్‌రావు ఆధ్వర్యంలో గొట్టె రామచంద్రం, పురుషోత్తంరావు, సురేశ్ తదితరులు తరలివెళ్లారు.

యువత గంజాయికి దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న సీఐ శశిధర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట: సమాజంలో యువత గంజాయి, గుడుంబా లాంటి వ్యసనాలకు దూరంగా ఉండి, బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రమాకాంత్ అన్నారు. మండలంలోని రాచర్లగుండారంలో బుధవారం రాత్రి పోలీస్ కమ్యూనిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గంజాయి లాంటి మత్తు పదార్థాలకు విద్యార్థులు, యువత అలవాటు పడి బంగారు జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ప్రతి గ్రామంలో నేరాల అదుపుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. దీంతో నేరస్థులను సకాలంలో పట్టుకునే అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో సర్పంచ్ భూక్య శంకర్ నాయక్, ఉపసర్పంచ్ బాలయ్య, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

సిరిసిల్లఅర్బన్: ముదిరాజ్‌లపై చూపుతున్న వివక్షతను నిరసిస్తూ సెప్టెంబర్ 3వ తేదిన స్థానిక కళాశాల మైదానంలో ముదిరాజుల మహాధర్నా సంబంధించిన కరపత్రాన్ని ముదిరాజ్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రాణవేణి లక్ష్మణ్ ఆవిష్కరించారు. ప్రతి పార్టీ ముదిరాజ్‌లకు 30 శాతం సీట్లు కేటాయించాలన్నారు. జిల్లాలోని ముదిరాజ్‌లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. నాయకులు భూమేశ్, రాము, మామిండ్ల నారాయణ,చుక్క రాజశేఖర్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కాంగ్రెస్‌లో చేరిక

వేములవాడఅర్బన్: బోయినపల్లి మండలం తడగొండ గ్రామ మాజీ సర్పంచ్ కట్ట కనుకవ్వ ఆధ్వర్యంలో 150 మంది యువకులు చొప్పదండి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం సమక్షంలో బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ మండల అధ్యక్షుడు రమణరెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్, కనుకయ్య పాల్గొన్నారు.

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం

ముస్తాబాద్: వంట గ్యాస్ ధరల తగ్గింపుపై హర్షం వ్యక్తం చేస్తూ మండలంలోని చీకోడులో ప్రధాన మంత్రి మోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు గున్నాల రమేశ్, సురేశ్, అరుణ్, దేవేందర్, రాజేశ్ బుధవారం క్షీరాభిషేకం చేశారు.

విద్యా సామగ్రి, దుస్తుల పంపిణీ

ఎల్లారెడ్డిపేట: మండలం రాచర్లగొల్లపల్లిలోని బీసీ హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్న నిరుపేద విద్యార్థులకు మాజీ ఏఎంసీ చైర్మన్ కొండ రమేశ్‌గౌడ్ దంపతులు దుస్తులు, బుక్స్, పెన్నులు, ఇతర విద్యా సామగ్రిని బుధవారం అందజేశారు.

ప్రొసిడింగ్ అందజేత

వేములవాడఅర్బన్: బోయినపల్లి మండలం మనువాడ గ్రామంలోని మిగులు అభివృద్ధి పనులకు రూ. 4 లక్షల ప్రొసిడింగ్ కాఫీని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గీత, బీఆర్‌ఎస్ యూత్ మండల అధ్యక్షుడు గోవర్ధన్, ఉపసర్పంచ్ ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా

గంభీరావుపేట: ముదిరాజ్ మహాసభ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గంభీరావుపేటకు చెందిన పిట్ల శ్రీమతి తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు రాష్ట్ర నాయకులకు తన రాజీనామా లేఖను పంపించినట్లు తెలిపారు. తన వ్యక్తిగత కారణాలతో పదవికి రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు.

ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించండి

తంగళ్లపల్లి: ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా అధికారులు చర్యలు తీసుకొని రక్షించాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జాలగం ప్రవీణ్ టోని అన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

చందుర్తి: ఛార్జ్ షీట్ పోస్టర్‌ను మండల కేంద్రంలో జెడ్పీటీసీ కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు.

ఆలయ నిర్మాణం పూర్తిచేస్తా

సిరిసిల్లఅర్బన్: అర్ధాంతరంగా నిలిచిపోయిన ముష్టిపల్లిలోని రేణుకామాత దేవాలయాన్ని పూర్తి చేసేందుకు కృషి చేస్తానని జిల్లా గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిదుగు గోవర్ధన్‌గౌడ్ అన్నారు. కార్యక్రమంలో గౌడ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు బొల్గం నాగరాజ్‌గౌడ్, చిదుగు భూషణ్‌గౌడ్, కొండ రమేష్‌గౌడ్, కాదాసు పెద్ద నరసయ్య, చిన్న నర్సయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ కిసాన్ సెల్ కార్యవర్గం

చందుర్తి: మండలం కట్టలింగంపేట గ్రామంలో కాంగ్రెస్ గ్రామ కిసాన్ సెల్ అధ్యక్షుడిగా మిరుపాల కొమురయ్యను, కార్యవర్గ సభ్యుల నియమాకాన్ని చేపట్టినట్లు కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బానాల రవీందర్‌రెడ్డి తెలిపారు.తెలిపారు.

ఓటమి భయంతోనే అక్రమ కేసులు

గంభీరావుపేట: అధికార పార్టీ నాయకులు రానున్న ఎన్నికల్లో ఓటమి భయంతో బీఎస్పీ నాయకులపై అక్రమ కేసులు పెట్టిస్తున్నారని బీఎస్పీ మండల అధ్యక్షుడు కర్రొల్ల రాజు అన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ఎల్లారెడ్డిపేట: మండలంలో జరుగుతున్న దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇళ్లకు తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు తప్పనిసరిగా పోలీసులకు ముందస్తు సమాచారం అందించాలని ఎస్సై రమాకాంత్ అన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు గ్రామాలకు వస్తే సమాచారం అందించాలన్నారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేసే వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామాల్లో ఏమైనా సమస్యలుంటే పోలీసులను ఆశ్రయించాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు.